బస్సు ప్రాంగణం.. బురద మయం


బస్టాండ్ ప్రాంగణంలో భారీగా నిల్వ చేరిన వర్షపునీరు (ఫైల్)


మోకాళ్లలోతు వర్షపునీటిలో బస్సులు బయటకు వస్తున్న దృశ్యం (ఫైల్)

- చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న బస్టాండ్
- రాకపోకలు సాగించేందుకు తప్పని కష్టాలు

కోవెలకుంట్ల: చిన్నపాటి వర్షాలకే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమవుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షపునీరు బస్టాండ్‌ను చుట్టుముడుతోంది. బస్టాండ్ నుంచి బస్సులు బయటికి వచ్చే రహదారి, లోనికి వెళ్లే రహదారిలో మోకాళ్లలోతు వర్షపునీరు నిల్వ చేరుతుండటంతో పాటు బస్సులు నిలిచే ఫ్లాట్‌ఫాం వరకు వర్షపునీరు చేరుతోంది. వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు బస్టాండ్‌లోకి వచ్చేందుకు బురదనీటిలో అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లోకి వెళ్లే రెండు దారుల్లో రోజుల తరబడి భారీగా వర్షపునీరు నిల్వ ఉండటంతో బస్సులను నడిపేందుకు కష్టతరంగా ఉందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. సంబంధిత అధికారులు బస్టాండ్ ప్రాంగణంలో నీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నంద్యాల శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో 200 మందికి బీపీ, షుగర్, సాధారణ జలుబు, జ్వరం, కంటి, గుండె సంబంధ వ్యాధులకు డాక్టర్లు నాగాంబిక, దివ్యశ్రీ, భరత్‌కుమార్, మనోజ్‌కుమార్, భార్గవ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఇంజినీర్ మధు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


అర్చకుడికి విరాళం అందజేస్తున్న దాతలు

డోన్: పట్టణ శివారులోని శనేశ్వర ఆలయ నిర్మాణానికి ఎస్ఆర్ వైన్స్ అధినేత రాజుగౌడ్, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎల్లాగౌడ్ రూ.1,11,111 బుధవారం విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విహారి స్వామి దాతలను సత్కరించారు.

పాఠశాలకు కుర్చీల విరాళం


కుర్చీలను అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన బొబ్బిడి నాగమద్దయ్య, గట్టు మల్లికార్జున, సుధాకర్, పెద్దయ్య, చిన్న పెద్దయ్య 8 ప్లాస్టిక్ కుర్చీలను హెచ్ఎం శ్రీనివాసులకు బుధవారం అందజేశారు. దాతల పిల్లలు ఇటీవల గురుకుల పాఠశాల్లో ప్రవేశాలు పొందారు. ఇందుకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులకు కృతజ్ఞగా కుర్చీలు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న మద్దిలేటయ్యలో సామూహిక వరలక్ష్మీ వ్రతం


శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఈనెల 8వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతితో పాటు మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణ మధ్య వ్రతం జరుగుతుందని చెప్పారు. లోక కళ్యాణార్థం నిర్వహించే వ్రతంలో మహిళలు పాల్గొనాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ఆర్ఎస్ రంగాపురం నుంచి ఆలయం వరకు ఉచిత ఆటో సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు


మాట్లాడుతున్న కవి సురేష్‌బాబు

డోన్ టౌన్ : ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత, ప్రముఖ ఆధ్యాత్మిక కవి తొగట సురేష్ బాబు, అసిస్టెంట్ బీసీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు అన్నారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీసీ కళాశాల బాయిస్ హాస్టల్‌లో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. సమితి వ్యవస్థాపకులు మలిశెట్టి జగన్‌మోహన్,ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, వార్డెన్ మేరి సూర్య కుమారి ఉన్నారు.

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రేయస్కరం


పెట్నికోటలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివమ్మ

కొలిమిగుండ్ల: బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ అన్నారు. బుధవారం పెట్నికోట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ..ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, శిరీష, నాగమ్మ, హెల్త్ సీహెచ్‌ఓ చెన్నమ్మ, సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్ఎం రేష్మ తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా గ్రామంలోని బాలింతలు, గర్భిణులలకు బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అయోమయంలో పొదుపు మహిళలు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో పొదుపు మహిళల పరిస్థితి గందరగోళంగా మారింది. బ్యాంక్‌లో తీసుకున్న రుణాలకు సంబంధించి సభ్యులు ప్రతి నెలా క్రమం తప్పకుండా బుక్ కీపర్ భర్తకు డబ్బు ఇస్తుండేవారు. అతను మాత్రం బ్యాంక్‌లో జమ చేయకుండా సొంత అవసరాలకు ఉపయోగించుకున్నాడు. ఈ తతంగమంతా దాదాపు ఏడాదికి పైగానే జరిగింది. చివరకు బ్యాంక్ అధికారులు బకాయిలున్నట్లు గుర్తించి మహిళల దృష్టికి తీసుకెళ్లడంతో అసలు విషయం బయట పడింది. 13 పొదుపు గ్రూపులకు సంబంధించి రూ.20లక్షలకు పైగానే బకాయి ఉన్నట్లు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో చూపుతోంది. ఇటీవల బ్యాంక్ అధికారులు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని పొదుపు మహిళలకు నోటీసులు జారీ చేశారు. మరో వైపు డబ్బులు వాడుకున్న బుక్‌కీపర్ భర్త పొదుపు మహిళలకు కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపించినట్లు తెలుస్తోంది. ఈ నోటీసులను మహిళలు తీసుకోలేదని సమాచారం. ఓవైపు బ్యాంక్ నుంచి అప్పు చెల్లించాలని నోటీసులు రావడం, మరో వైపు ఐపీ నోటీసులు రావడంతో మహిళలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. బకాయిలు చెల్లిస్తేనే మళ్లీ రుణాలు ఇస్తామని అంత వరకు ఇచ్చేందుకు వీలుపడదని అధికారులు తేల్చి చెబుతున్నారు. బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని అప్పట్లో మహిళలు పోలీస్ స్టేషన్, అధికారుల చుట్టు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. స్త్రీ నిధి రుణాలకు సంబంధించి సైతం అంతా అస్తవ్యస్తంగా ఉంది. ఇతర పొదుపు గ్రూపు సభ్యులు నిబంధనల ప్రకారం సకాలంలో కంతులు చెల్లించలేదనే కారణంగా బ్యాంక్ అధికారులు లోన్ మొత్తాన్ని పెంచడం లేదని మహిళలు వాపోతున్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన పవులూరి సుబ్బారావు, ఆయన సతీమణి లక్ష్మీనవీన బుధవారం రూ.25వేల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని దాతలు ఆలయ అర్చకులు, వేదపండితులకు అందించారు. దాతలను ఆలయ సంప్రదాయ మేరకు సన్మానించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే


డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న సీఐ హనుమంతు నాయక్

కోవెలకుంట్ల: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ హెచ్చరించారు. కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారిలో పట్టణ శివారులోని కుందూనది వంతెన సమీపంలో బుధవారం వాహనాల తనిఖీ, డ్రంకన్‌డ్రైవ్ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న వ్యక్తులను ఆపి సీఐతోపాటు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో డ్రంకన్‌డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. అలాగే ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

పాఠశాలల తనిఖీ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ రమణారెడ్డి

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు, పేరుసోముల, రామిరెడ్డిపల్లె గ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను ఎంఈఓ రమణారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మధ్యాహ్నం భోజనం మెను ప్రకారం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడుగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వైర్ల చోరీ


వైర్ లేకపోవడాన్ని చూపుతున్న రైతు చంద్రశేఖరప్ప

బేతంచెర్ల: మండలంలోని యంబాయి గ్రామంలో రైతుల బోర్లకు ఏర్పాటు చేసిన వైర్లను చోరీ అవుతున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. గ్రామానికి చెందిన చిక్కా చంద్రశేఖరప్ప బోరుకు చెందిన కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లి మోటార్ ఆన్ చేయగా.. స్టార్ట్ కాకపోవడంతో పరిశీలించగా.. వైర్‌ను కత్తిరించి ఉండటాన్ని గమనించాడు. ఇదిలా ఉండగా.. గ్రామానికి చెందిన ముల్లా ఖాజా హుసేన్ మూడు బోర్లకు చెందిన వైర్లను రెండు సార్లు ఎత్తుకెళ్లారు. గత నెలలో మహబూబ్ బాషాకు చెందిన నాలుగు బోర్ల వైర్లను చోరీ చేశారని బాధితులు వాపోయారు. అలాగే.. సుధాకర్, సీతారామాపురం గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, ధనుంజయ రెడ్డి పొలాల్లో మోటార్ల కేబుళ్లను తస్కరించారని చెప్పారు.

పారదర్శకంగా ఉపాధి పనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఉపాధి పనులు చేపట్టాలని ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిలో కూలీల మస్టర్లు నమోదు, పనుల గుర్తింపు, 7 రికార్డుల నమోదు వంటి కార్యక్రమాలు ఇక మీదట ఎన్ఎమ్ఎమ్ఎస్ యాప్ ద్వారానే నమోదు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు జియోట్యాగింగ్ చేయవలసి ఉంటుందన్నారు. పని ప్రదేశంలో చేపట్టిన పనుల పేరు, వ్యయంతో కూడిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సార్పీ శ్రీనివాసులు, కోర్స్ డైరెక్టర్ ఏసుదాసు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్‌బాషా, ఏపీఓలు పాల్గొన్నారు.

9న వేంకటేశ్వరుడి కల్యాణం

డోన్ : స్థానిక తిరుమల వీరాంజనేయ స్వామి కొండపై నిర్మించిన సీతారామ కల్యాణ మండపంలో ఈ నెల 9వ తేదీన మాణిక్యప్రభు సేవాసమితి ఆధ్వర్యంలో భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమితి గౌరవ అధ్యక్షుడు కోత్రికె హరికిషన్ బుధవారం తెలిపారు. శ్రీనివాసుడి జన్మ నక్షత్రం, హయగ్రీవ జయంతి, రాఖీ పూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ లాంటి విశిష్టమైన రోజు కావడంతో వేడుక నిర్వహించ తలపెట్టామన్నారు. 108 మంది భక్త కుటుంబాలతో ఉదయం 10 నుంచి 11.55 గంటల వరకు కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. చివరగా..గిరి ప్రదక్షిణ కూడా జరుగుతుందన్నారు.

కోర్టు ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ప్యాపిలి: కోర్టు ఆదేశాల మేరకు డోన్‌కు చెందిన నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు జలదుర్గం పోలీసులు బుధవారం తెలిపారు. గార్లదిన్నె గ్రామంలోని సర్వే నంబర్ 401లో ఉప్పలపాటి జక్కలేరు మే నెలలో పొలం పనులు చేసుకుంటుండగా షేక్ మహమ్మద్ హుసేన్, మస్తాన్ వలి, ఆరిఫ్ దాదా, ఆసిఫ్ దాదా కులంపేరుతో దూషించి అడ్డుకున్నారు. దీంతో బాధితుడు అప్పట్లో జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో బాధితుడు కోర్టు ఆశ్రయించగా.. కోర్టు కేసు నమోదు చేయాలని ఆదేశించిందని పోలీసులు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్యాపిలి: స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధికార ప్రతినిధి గుండాల ఈశ్వరయ్య, ఎంఈఎఫ్ జిల్లా నాయకులు సుందరం ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా రెడ్డి పోగుల విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సురేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రంగ తదితరులను ఎన్నుకున్నారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా పెద్దపాయ నాగపుల్లయ్య, మండల ఉపాధ్యక్షుడిగా గార్లదిన్నె వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా జానకిరాముడును ఎన్నుకున్నారు.

ఆశాలకు కనీస వేతనం చెల్లించాలి

ప్యాపిలి: ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ఏ చిన్న రహిమాన్, సహాయ కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు, ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కృష్ణవేణి డిమాండ్ చేశారు. జలదుర్గం పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దాదాపు 18 సంవత్సరాలుగా ఆశా వర్కర్లుగా పని చేస్తున్నప్పటికీ వీరి వేతనం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని కోరారు. పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మధ్యలో బడిమానేసి, 14 సంవత్సరాలు నిండిన వారు, పదో తరగతి ఫెయిల్ అయినవారు ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక మెయిన్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం హరికృష్ణ బుధవారం తెలిపారు. ఆయా అభ్యర్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. వివరాలకు హైస్కూల్లో సంప్రదించాలని సూచించారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని బుధవారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీ సమేత మహానందీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లకు అష్టవిధ మహామంగళహారతులు చేపట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్యకల్యాణం జరిపించారు.


వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డోన్ పర్యటనకు వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


డోన్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

యూరియా అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ భూమ జ్యోతి

సంజామల: మండలంలోని ఎరువుల దుకాణాలలో యూరియా బస్తాలను అధిక రేటుకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి భూమ జ్యోతి హెచ్చరించారు. మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ఉన్న పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఏఓ తనిఖీ చేశారు. దుకాణంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లడుతూ.అనుమతులు లేని బయో మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యూరియా బస్తాలను అడిగిన రైతులకు తప్పనిగా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ధర ఒక బస్తాకు రూ.267 చొప్పున అమ్మాలని సూచించారు.

ఇరుకు వంతెనలు.. తరచూ ప్రమాదాలు


బనగానపల్లె-అమరావతి నేషనల్‌హైవేపై ఉన్న ఇరుకు వంతెనలు



బనగానపల్లె : బనగానపల్లె– అమరావతి నేషనల్ హైవే పై బనగానపల్లె సమీపంలోని టంగుటూరు క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న రెండు వంతెనలు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని విస్తరించి వెడల్పు పెంచేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించిన కాలంలో సుమారు వంద సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా రహదారిని ఏర్పాటు చేసి వంతెనలు నిర్మించారు. రానురాను జనాభా పెరుగుదలతో పాటు ట్రాఫిక్ పెరిగింది. అలాగే ఈ రహదారిని నేషనల్ హైవేగా మార్చారు. అయితే వంతెనలను మాత్రం విస్తరించలేదు. ఈ రహదారి పై జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి బనగానపల్లె రైల్వే స్టేషన్‌కు ముడిసిమెంట్‌ను వాహనాల ద్వారా నిత్యం తరలిస్తుంటారు. దీంతోపాటు ఇతర వాహనాలు తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య తెలత్తుతోంది. ఈ వంతెనలను వెడల్పుగా మార్చేందుకు సుమారు 6 సంవత్సరాల క్రితం చెన్నైకు చెందిన ప్రైవేట్ కంపెనీవారు ల్యాండ్ టెస్టింగ్ చేసి వంతెనల వెడల్పుకు అనుకులంగా ఉంటుందని నివేదిక కూడా ఇచ్చారు. అయినా ఇంత వరకు ఈ వంతెనలు అభివృద్ధికి నోచుకొనందున ట్రాఫిక్ సమస్య తప్పడంలేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకొని వంతెనలను విస్తరించాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడండి


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు విష జ్వరాల భారిన పడుతున్నా మున్సిపల్ అధికారుల్లో చలనం లేదని, ఇప్పటికైనా ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,కమిటీ సభ్యులు చిన్న రహిమాన్,షమీంబేగం అన్నారు. బుధవారం ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో మురుగు కాలువలు,సీసీ రోడ్లు లేనందున వర్షం నీరు నిల్వ చేరి వీధులు మురికి కూపాలకు మారాయి. దోమల బెడద తీవ్రమవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య పనులతో పాటు కాలనీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అశోక్, చాముండేశ్వరి, సూర్య పద్మ, బీబీ, భూలక్ష్మీ పాల్గొన్నారు.


ఆర్కే పెట్రల్ బంకు ఆవరణలో వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలు

గణనాథులు వచ్చేశారు..

ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కోవెలకుంట్ల పట్టణంలో ముందస్తుగా పండుగ సందడి నెలకొంది. స్థానిక ఆర్కే పెట్రోల్‌బంకు ఆవరణ, ముదిగేడు చౌరస్తా, పట్టణ శివారులోని మార్కెట్‌యార్డు ఎదురుగా వినాయక విగ్రహాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐదు అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో వివిధ రూపాయాల్లో తయారు చేసిన వినాయక ప్రతిమలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు మండలాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీలు ముందస్తుగానే విగ్రహాల కొనుగోలు పనుల్లో నిమగ్నమయ్యారు. ఆయా గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీలు విగ్రహాల కొనుగోలుకు ముందుగానే అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు.

– కోవెలకుంట్ల